**కథ**

''ముహూర్తం సమయానికి చేరుకొనేలాగా 15వ తేదీ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి విజయవాడ వస్తున్నాను'' అని ఇంటికి టెలిగ్రాం పంపించి లోకల్ ట్రైన్‌లో కూర్చున్నాను.

# కలలపంట

రాత్రి తొమ్మిది గంటలు దాటటంతో రైల్లో పెద్ద రష్‌గా లేదు. పక్క కంపార్ట్‌మెంట్‌లోంచి ఎవరో ముష్టివాళ్ళు రాళ్ళతో తాళం వేస్తూ ''షిరిడి వాలే..సాయిబాబా..'' అని పాడుకుంటూ అడుక్కుంటున్నారు.

టెలిగ్రాం చూసి అమ్మ ఏమనుకుంటుంది? బహుశా ఆశ్చర్యపోతుంది.

ఏ ముహూర్తం గురించి వీడు మాట్లాడేదని కలవరపడుతుంది.

అక్క పెళ్ళి కాకుండానే వీడి పెళ్ళి చేశారని లోకులు కాకుల్లాగా పొడుస్తారని వాపోతుంది.

ఇంత ముద్దుగా పెంచుకున్న నా కన్న ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడేమని తనను తానే ప్రశ్నించుకుంటుంది.

తను కోరుకున్న పిల్లని పెళ్ళాడతానంటే కాదంటామని తనకి తానే ముహూర్తం నిర్ణయించుకున్నాడు. అమ్మని ఇంతేనా అర్థం చేసుకుంది నా కన్న - అని గుడ్ల నీళ్ళుకక్కుతుంది.

విజయవాడని తల్చుకుంటేనే నా శరీరం పులకరించిపోతుంది. పుట్టిన ఊరు మీది మమకారం అలాంటిదేమో!

గలగల పారే కృష్ణాతరంగాల సవ్వడి, కొండపై నిండుగా కొలువున్న కనకదుర్గమ్మ ఉడికిస్తుంది.

కృష్ణమ్మ శపథం చేసిందట..

''కొండమీద కొలువుతీరి ఉన్నానని గొప్పలు చాలించమ్మా దుర్గమ్మా! ఏనాటికైనా ఉవ్వెత్తున ఎగసి నీ వజ్రాల ముక్కెరని తాకుతాను'' అని.

కృష్ణమ్మ గమనాన్ని క్రమబద్ధం చేసే ఆర్థర్ కాటన్ అపూర్వసృష్టి ప్రకాశం బారేజీ. దూరంగా ఒక వంక గాంధీ స్థూపం. మరొక వంక కొండమీద గుణదల మరియమ్మ గుడి. వన్ టౌన్ ఇరుకు సందుల మధ్య గత వైభవం కోల్పోని పాతశివాలయం.

మధ్య తరగతికి మారుపేరు మా కుటుంబం. నాన్న రైల్వేలో ఉద్యోగం. పెరిగే ఇన్‌ఫ్లేషన్‌తో సమానంగా పెరగని జీతాలు డబ్బు ఒక సమస్య అయినా, అది సమస్యే కాదన్నట్టుగా గుట్టుగా సంసారం చేస్తూ మమ్మల్ని పెంచి పెద్దచేసింది అమ్మ.

అమ్మతో మరపురాని అనుభవాలు నాకు అనేకాలు.

పన్నెండేళ్ళ వయసు వచ్చినా మమ్మల్ని భయపెట్టాలంటే మూడు ముక్కలాడికి ఇస్తానని భయపెట్టేది అమ్మ. ఆవిడ బెదిరింపులకి ఏమాత్రం లొంగని మేము ఇస్తే ఇచ్చుకోమని దబాయించేవాళ్ళం. మేము చేసే రాక్షస అల్లరికి కోపం వచ్చినా ''కొట్టనా! కొట్టనా!'' అని చేతులు ఎత్తేదేకాని, ఆ ఎత్తిన చేయి చురుకుగా మా మీద ఏనాడూ పడేది కాదు. మా మీద ఉన్న అచంచల ప్రేమ ఆ చేతుల్ని మధ్యలోనే ఆపేసేది. ఆమె చేతకానితనాన్ని ఏనాడూ అవకాశంగా తీసుకోలేదు. చదువులో అక్కా, నేనూ ఎప్పుడూ ఫస్టే.

పదో తరగతిలోకి వచ్చిన దగ్గర నుండీ ఎలాగయినా ఇంజనీర్ని అవ్వాలనే బలీయమైన కోర్కెని నాలో కలిగిస్తూ వచ్చింది అమ్మ. ఎమ్‌సెట్ ఎంట్రెన్స్ రాశాను. ఇంజనీరింగ్‌లో విజయవాడ లోనే ఒక ప్రైవేట్ కాలేజీలో నాకు సీట్ వచ్చింది. ఉన్న ఊళ్ళోనే సీటొచ్చిందని సంతోషించాలో లేక ఫీజులు ఎక్కువగా వసూలు చేసే ప్రైవేట్ కాలేజీలో దొరికిందని బాధపడాలో తెలియని పరిస్థితి.

నాన్న ఖండితంగా చెప్పేశారు. ''నిన్ను ఇంజనీరింగ్ చదివించే స్తోమతా, శక్తీ నాకు లేవు. ఇంజనీరింగ్ వద్దు డిగ్రీలో చేరి పొమ్మ''ని. నాన్నని ఈ విషయంలో తప్పు పట్టలేం. ఆయనకు ధైర్యం చాలలేదు నన్ను ఇంజనీరింగ్‌లో చేర్పించటానికి. వేలతో పని కాదది. లక్షలతో పని.

అప్పుడే అమ్మ మొదటిసారి నాన్నకి ఎదురు చెప్పింది. ''నా కొడుకుని నేను ఇంజనీర్ని చేసి తీరుతాను. మీకు ఓపికుంటే సహాయం చెయ్యండి. లేకపోతే ఎలా నా కొడుకుని ఇంజనీర్ని చేస్తానో చూస్తూ కూర్చోండి'' అంది.

నాన్న అమ్మలోని క్రొత్త అమ్మని తెల్లబోయి చూశారు. ఇంతకాలం బెదురు చూపుల బేలలాగా ఉండే అమ్మ పెద్దపులి అయిపోయింది.

బ్యాంక్‌లో పనిచేస్తున్న తన మేనమామని కలిసి స్టూడెంట్ లోన్ కోసం అడిగింది. ఎన్నో కష్టనష్టాలనీ, అవమానాలనీ ఓర్చి నాకు ఇంజనీరింగ్ కాలేజీలో చేరే అవకాశం కల్గించింది అమ్మ. నా చదువుకీ ఇతర ఖర్చులకీ వస్తుందని పదిమంది పిల్లలకి ట్యూషన్స్ చెప్పటం మొదలుపెట్టింది అమ్మ. అప్పట్లో మేము రెండు గదుల ఇంట్లో ఉండేవాళ్ళం. ఆ చిన్న ఇంట్లోనే ఒక పక్క పిల్లలకి ట్యూషన్లు, ఒక్క పక్క అక్కా, నా చదువులు. తెల్లవారి నాలుగు గంటలకే అమ్మ కూడా మాతోపాటుగా నిద్ర మేల్కొనేది. తను పడుకుంటే తన వెనకే మేము కూడా పడుకుంటామేమో అని.

ఇలా ఎన్నో కష్టాలకి ఓర్చి, నాలుగు మరపురాని సంవత్సరాలు గడిపి ఇంజనీరింగ్ పరీక్షలు పూర్తి చేశాను. అప్పటికి దేవుడు మమ్మల్ని కొంచెం చల్లగా చూశాడనుకుంటాను.

పరీక్షలు అవుతూనే చిన్న మామయ్య దగ్గర నుండీ ఉత్తరం వచ్చింది. వెంటనే బయల్దేరి ముంబయి రమ్మని. అక్కడ ఏవో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఉత్తరం వచ్చిందే తడవుగా బయల్దేరి ముంబాయి వెళ్ళాను.

ముంబయి నగరం ప్రతి మనిషి మనో వికాసానికీ గేట్ వే అనిపిస్తుంది నాకు. ముంబయి జీవితాన్నీ, ఉద్యోగం కోసం నా ప్రయత్నాలనీ చూస్తున్నప్పుడు అనిపించింది నాకు. నేనూ, నా తెలివితేటలూ ఈ కాంపిటేటివ్ వాతావరణంలో ఎంత అల్పమైనవో అని.

మామయ్య రికమండేషన్ పనిచేసిందో లేక నేను ఇంటర్వ్యూ బాగా చేశానో తెలీదు కానీ, పూర్తిగా ఇరవై ఒక్క సంవత్సరాలు నిండకుండానే, ఇంకా ఇంజనీరింగ్ రిజల్ట్స్ కూడా రాకుండానే ఒక పెద్ద కంపెనీలో నెలకి పదివేల జీతంతో ఉద్యోగం దొరికింది. అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ తీసుకొని ఇంటికి వచ్చినప్పుడు చూశాను అమ్మ ముఖంలో వెలుగు.

తను కంటికి రెప్పలాగా కాపాడి చదివించిన కొడుకు ప్రయోజకుడయ్యాడనే సంతోషం, సంతృప్తి.

ఆ వెలిగే కన్నుల్లోంచి ఆణిముత్యాల్లాంటి ఆనంద భాష్పాలు. అది మా అందరి ఆనందానికీ పరాకాష్ట. ఆ రోజు నుండీ నేను ఊరు వెళ్ళే రోజు దాకా చేసిన పదార్థాలు చెయ్యకుండా రకరకాల వంటకాలు చేసి గోరుముద్దలు తినిపించింది అమ్మ. అలా మొదలయింది నా ఉద్యోగపర్వం. అప్పటి నుండే అక్కా, నేనూ ఎప్పుడు ఇంటికి వచ్చినా అమ్మా, నాన్నలకి అదో పర్వదినం. నాకోసం ఇంత చేసిన అమ్మానాన్నలకి ఏదో ఇవ్వాలనే బలీయమైన కోర్కె మెల్లగా నాలో రూపుదిద్దుకోవటం మొదలుపెట్టింది. నేనెక్కిన రైలు ఖా స్టేషన్‌లో ఆగటంతో రైలు దిగి కంపెనీ ఇచ్చి

ఫ్లాట్ చేరుకున్నా.

ఎంతగానో ఎదురుచూసిన ఆ రోజు తారీఖు రానే వచ్చింది. ఆరోజు చాలా ఉత్సాహంగా విజయవాడ బయల్దేరాను. రైలు ఏ స్టేషన్‌లోనైనా సిగ్నల్ కోసం ఎక్కువసేపు ఆగితే అసహనం పెరగటం మొదలుపెట్టింది. రైలు విజయవాడ స్టేషన్ ఆగి ఆగగానే క్రిందికి దిగి ఫ్లాట్‌ఫాం అంతా ఆత్రంగా కలియచూశాను. సాధారణంగా నేను ఎప్పుడు వస్తున్నా స్టేషన్‌కి నాన్న వస్తారు. ఈరోజు నాన్న రాలేదు. నాలో నేను నవ్వుకుంటూ ఆటో ఎక్కి ఇంటికి చేరుకున్నాను. నేను ఎప్పుడు వస్తున్నానని తెలిసినా వీధి అరుగుల మీద కూర్చుని అమ్మ నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. కానీ ఈరోజు తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయని అలా సగం వేసిన తలుపు సందుల్లోంచి అమ్మ నాకోసం చూస్తుందని నాకు తెలుసు. నా అంచనా తారుమారు కాలేదు. నేను చూశానని గ్రహించిన అమ్మ ముఖం తిప్పేసుకుంది. టీపాయ్ మీద నాకోసం మంచినీళ్ళు సిద్ధంగా ఉన్నాయ్. ప్రతిసారీ నేను ఇంటికి చేరంగానే చిన్న పిల్లాడికి పెట్టినట్టు తలకీ, వంటికీ నలుగు పెట్టి తలంటి పోస్తుంది అమ్మ.

ఈ తడవ ''పెద్ద వాడివైపోయావు కదా! మా పెద్దరికం మంట కలిపి ముహూర్తం టైంకి వస్తున్నానని టెలిగ్రాంలు. ఏం నీవు మెచ్చుకున్న పిల్లని కాదంటామని నీ భయమా?'' అంటూ చెడామడా తిట్టి, ''బాత్రూంలో అన్నీ సిద్ధంగా ఉన్నాయ్. తలంటు పోసుకు రా'' అంది అమ్మ.

నాన్న కూడా పెద్దగా మాట్లాడలేదు. అందరం భోజనానికి కూర్చున్నాం.

భోజనాల ముందు చెప్పాను. 'మూడు గంటలకి మూర్తిగారని ఈ శుభకార్యానికి సూత్రధారుడు వస్తారు. ఆయన చాలా పెద్దమనిషి. మనం దరం ఆయనతో ఆ ఇంటికెళ్ళాలి. నా కోసం కాదనకండి'' అని చెప్పాను. అయిష్టంగా తలూపారు అమ్మా, నాన్నా.

అనుకున్నట్లుగా మూడింటికి మూర్తిగారొచ్చారు. అమ్మా, నాన్నా ఆయనకి అంటీముట్టనట్టుగా ఉన్నారు. అందరం ఆయన కార్లో బయల్దేరి వెళ్ళాం. కొత్తగా కట్టినట్టున్న ఒక ఇంటిముందు కారాగింది. కొంచెం కోపంగా నాన్న, రుసరుసలాడుతూ అమ్మా లోపలికి దారితీశారు. లోపల అడుగుపెడుతూనే అమ్మా, నాన్నా తెల్లబోయారు. ఇల్లంతా ఖాళీగా ఉంది. మూర్తిగారు అప్పుడు చొరవ తీసుకొని చెప్పారు.

''ఈ ఇల్లు మీ కోసం మీ అబ్బాయి కట్టించాడండీ! నేనే ఈ ఇంటిని కట్టించిన కాంట్రాక్టర్ని''

అమ్మా నాన్నల కనుకొలకుల్లో పల్చటి కన్నీటిపొర.

''వద్దమ్మా!'' అన్నాను నేను.

''నాకు ఊహ తెలిసినప్పటి నుండీ రెండు గదుల చిన్న ఇంట్లో ఉంటూ వచ్చాం మనం. ఎవరైనా చుట్టాలు ఇంటికొస్తే మంచంకింద దూరి మేమూ, నేల మీద మీరూ పడుకొని, వచ్చిన చుట్టాలని పైన పడుకోపెట్టేవాళ్ళం. అప్పటి నుండీ నాకొక బలీయమైన కోర్కె ఉండేది. ఎలాగైనా మనకంటూ ఒక పెద్ద ఇల్లు కట్టుకోవాలని. ఆ కోర్కె ఇలా రూపు దిద్దుకొంది.

కంపెనీ లోన్, బ్యాంక్ లోన్ తీసుకుని ఇల్లు కట్టించాను. ఒక 5 సంవత్సరాలు జాగ్రత్తగా ఉంటే లోన్స్ తీరిపోతాయి. నా పెళ్ళి టైంకి బహుశా లోన్స్ అన్నీ తీరిపోతాయి. నీ కోడల్ని నీ ఇంట్లోకి గృహప్రవేశం చేయించవచ్చు''

నా మాటల్లో అంతరార్థం అమ్మ ఇట్టే గ్రహించింది.


పెళ్ళాయ్యాక ఇల్లుకడితే, లేక ఇంటి లోన్ తీరిస్తే కొత్తకోడలు ఇల్లు తమదని అమ్మా, నాన్నల మీద పెత్తనాలు చెలాయించవచ్చు. ఇప్పుడు ఆ అవకాశం ఉండదు.

''ఎంత పెద్ద మనసురా నీది'' అని అమ్మ నా బుగ్గన ముద్దు పెట్టుకుంది. అమ్మ కళ్ళ వెంట ధారలుగా నీరు కారుతున్నాయ్. వాటిని ఆపే ప్రయత్నం ఎవ్వరం చెయ్యలేదు. ఇల్లంతా తనివితీరా కలియతిరిగి బయటికి వెడుతున్నప్పుడు చూశారు అమ్మా, నాన్నా.

ఇంటిబయట నల్లని ఫలకం మీద లక్ష్మీ సదనం అని ఒకవైపూ, అమ్మా నాన్నల పేర్లు రెండోవైపు.

సంతోషంగా అమ్మ నాన్న వైపు, నాన్న అమ్మ వైపూ, వాళ్ళిద్దరి వైపూ సంతృప్తిగా నేనూ చూశాను.

గృహప్రవేశం ముహూర్తం ఎల్లుండి ఉదయం నాలుగు గంటలకని గుర్తు చేస్తున్న మూర్తిగారి మాటలకి తలూపుతూ.



మల్లాది రవిశంకర్